నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 12 జనవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఎంపికైన విద్యార్థినులు పుష్పలత, కళ్యాణి, అక్షయ

బెల్లంపల్లి, జనవరి 11 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టుకు ఎంపికైన బుక్యా పుష్పలత, బీ.కళ్యాణి, బీ. అక్షయ ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు సిద్ధిపేట జిల్లా కొండాపూర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని కళాశాల పీడీ బాబురావు తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్ అంజయ్య, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఎడ్ల సోమయ్య, లెక్చరర్లు ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మైలారం విద్యార్థిని

విద్యార్థినితో హెచ్ఎం, పీఈటీలు

నెన్నెల, జనవరి 11 : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మైలారం ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న గంట వైష్ణవి ఎంపికైనట్లు హెచ్ఎం పీ చంద్రశేఖర్ రెడ్డి, పీఈటీ సాంబమూర్తి గురువారం తెలిపారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 10న శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో నిర్వహించిన అండర్- 14 జోనల్ స్థాయి కబడ్డీ పోటీల్లో బాలికల విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు జనగామలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో వైష్ణవి పాల్గొంటుందని పేర్కొన్నారు. విద్యార్థినిని పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ తాడూరి భాస్కర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నస్పూర్ మున్సిపాలిటీకి 12వ ర్యాంకు

నస్పూర్ మున్సిపల్ కార్యాలయం

సీసీసీ నస్పూర్, జనవరి 11: కేంద్ర ప్రభుత్వం గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులు ప్రకటించగా, నస్పూర్ మున్సిపాలిటీకి 12వ ర్యాంకు వచ్చింది. కేంద్రం స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో భాగంగా సౌత్‌జోన్‌లోని 201 మున్సిపాలిటీల్లో సర్వే నిర్వహించగా, సౌత్ జోన్ నుంచి నస్పూర్ మున్సిపాలిటీకి 12వ ర్యాంకు వచ్చింది. ర్యాంకు రావడంపై కమిషనర్ తన్నీరు రమేశ్, మున్సిపల్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సహకరించిన మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ప్రజలకు కమిషనర్ ధన్యవాదాలు తెలిపారు. మరింత ఉత్సాహంతో తామంతా పనిచేస్తామని పేర్కొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధచూపాలి

- కరోనా నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు

చెన్నూర్ రూరల్, జనవరి 11: ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు అన్నారు. గురువారం చెన్నూర్ మండలంలోని అంగ్రాజ్‌పల్లిలోని పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ మాస్కు ధరించేలా అవగాహన కల్పించాలని సూచించారు. సబ్ సెంటర్లలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం ఓపీ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు కృష్ణ తేజ, హెచ్ఈవో జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి

గర్మిళ్ల, జనవరి 11 : సంక్రాంతి పండుగ సెలవులకోసమని సొంతూర్లకు వెళ్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. బంగారు, వెండి ఆభరణాలు, నగదును బ్యాంకు లాకర్లలో.. లేక ఇళ్లలోని రహస్య ప్రాంతాల్లో దాచుకోవాలని తెలిపారు, వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోవాలని, ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా చెయిన్ లాక్‌లు వేయాలని, నమ్మకమైన వ్యక్తులను మాత్రమే సెక్యూరిటీ గార్డులుగా నియమించుకోవాలని సూచించారు, ఇంట్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని, స్థానిక పోలీస్ స్టేషన్‌లలో సమాచారం అందిస్తే నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎవరైనా అనుమానితుల కనిపిస్తే డయల్-100కు సమాచారం ఇవ్వాలని, పోలీస్ శాఖ సూచనలు పాటిస్తూ.. సహకరిస్తే దొంగతనాలు నియంత్రించడం సులభం అవుతుందని పేర్కొన్నారు.

ఆ పులులెక్కడ?

అడవిని జల్లెడ పడుతున్న అటవీశాఖ

- 13 బృందాలుగా విడిపోయి ట్రాకింగ్
- మూడు పులుల పాదముద్రల గుర్తింపు.. సురక్షితంగా ఉన్నట్లు భావిస్తున్న అధికారులు
- విషప్రయోగంపై ఆరుగురిని అదుపులోకి తీసుకొని సీన్ రీ-కన్‌స్ట్రక్షన్

అధికారులు పాదముద్రలు గుర్తించినట్లుగా చెప్తున్న ఎస్-6(ఆడపులి), దాని పిల్లలు

మంచిర్యాల, డిసెంబర్ 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : విషప్రయోగంతో పులులు చనిపోయిన ఘటనతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ జిల్లా అటవీ శాఖ, మిగిలిన పులుల జాడ కోసం అడవిని జల్లెడ పడుతున్నది. బుధవారం మొదటి రోజు 70 ట్రాకర్లతో 15 బృందాలుగా విడిపోయి గాలింపు చేపట్టిన అధికారులు, రెండోరోజైన గురువారం 120 మంది ట్రాకర్లతో 13 బృందాలుగా విడిపోయి గాలిస్తున్నారు. రెండు పులులు మృతి చెందిన కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని దరిగాం అటవీ ప్రాంతంతో పాటు ఆసిఫాబాద్, సిర్పూర్ డివిజన్‌లలోనూ అన్వేషిస్తున్నారు. ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలోని వాంకిడి మండలం సర్కేపల్లి చుట్టూ ఉన్న భారీ గుట్టలు, దట్టమైన అడవిని నలువైపులా ట్రాకింగ్ చేశారు. ఈ క్రమంలోనే అధికారులు మూడు పులుల పాదముద్రలను గుర్తించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఎస్-9, ఎస్-15 మృతి చెందగా, ఎస్-9(మగపులి) జతగా ఉన్న ఎస్-6(ఆడపులి)తో పాటు వాటి పిల్లలైన మరో రెండు పులుల పాదముద్రలు గుర్తించినట్లు తెలిసింది. దీంతో ఆ మూడు పులులు సురక్షితంగా ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ పులుల జాడను ట్రాక్ చేసేందుకు కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, సిర్పూర్‌తో పాటు గురువారం మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నుంచి ట్రాకర్ల బృందాలను రప్పించారు. తొలుత మృతి చెందినట్లు గుర్తించిన ఎస్-15 పులి ఇంకో పులితో పోరాడి చనిపోయినట్లు చెప్పిన అధికారులు.. ఇప్పుడు ఆ పులి సైతం విషప్రయోగంతోనే మరణించి ఉంటుందని భావిస్తున్నారు. మొత్తం ఆరు పులుల్లో రెండు చనిపోగా, మూడు సురక్షితంగా ఉన్నాయనుకుంటే, మరో పులి ఏమైందన్నది తేలాల్సి ఉంది. అయితే ఈ ఆరు పులుల్లో ఒకటి ఎప్పటి నుంచో తల్లిదండ్రులను వదిలేసి వేరుగా సంచరిస్తున్నదని, విషం తిన్న పులుల్లో అది ఉందా లేదా అనేది ఇప్పుడు సందేహంగా మారింది. ఈ విషయంలో అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.

అదుపులో ఆరుగురు..సీన్ రీ-కన్‌స్ట్రక్షన్

విషప్రయోగం చేసినట్లుగా అనుమానిస్తున్న ఆరుగురిని అధికారులు బుధవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. వాంకిడి మండలం సర్కేపల్లి గ్రామానికి చెందిన నలుగురు, కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని దరిగాం గ్రామానికి చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా, ఇందులోని ఇద్దరు తామే విషప్రయోగం చేసినట్లు ఒప్పుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. విష ప్రయోగం చేసిన ఇద్దరు కూడా సర్కేపల్లి వాసులుగా చెబుతున్నారు. ఈ ఇద్దరితో పాటు అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరు మైనర్లు, దరిగాంకు చెందిన మరో ఇద్దరు విషప్రయోగానికి సహకరించినట్లుగా అధికారులు భావిస్తున్నారు. వీరంతా ఇప్పుడు అదుపులోనే ఉన్నారు. గురువారం ఉదయం ఈ ఆరుగురిని అధికారులు అడవిలోకి తీసుకెళ్లి.. పులులకు విషప్రయోగం చేసి ఆహారాన్ని తింటున్నప్పుడు ఎక్కడి నుంచి చూశారు.. ఎలా వీడియో తీశారు.. అనే విషయాలపై సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ చేశారు. పశుకళేబరంపై విషం చల్లిన తర్వాత .. ఆ డబ్బాను పడేసిన ప్రాంతంతో పాటు వారు వచ్చి వెళ్లిన మార్గాన్ని అధికారులకు చూపించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. గురువారం రాత్రి వరకు పులుల కోసం వెతుకులాట కొనసాగింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

పులి దాడిలో లేగదూడ మృతి

కాగజ్‌నగర్, జనవరి 11 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఊట్‌పల్లి గ్రామ అటవీ ప్రాంతంలో లేగదూడపై పులి దాడి చేసిన విషయం గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఊట్‌పల్లి గ్రామ శివారులోకి సోమవారం పశువులు మేతకు వెళ్లాయి. మూడేళ్ల లేగదూడపై పులి దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయాన్ని పశువుల కాపరి అదే రోజు సాయంత్రం వెళ్లి దాని యజమానికి తెలియజేశాడు. చివరకు గ్రామస్తులకు తెలియడంతో వారు గురువారం అటవీశాఖ అధికారులకు తెలిపారు. ఈ ఘటనపై వెళ్లి విచారణ చేపడుతున్నారు.

కాగజ్‌నగర్ డివిజన్ కార్యాలయం ఎదుట ఆందోళన

పిల్లల కోసం పడిగాపులుకాస్తున్న కుటుంబ సభ్యులు

కాగజ్‌నగర్, జనవరి 11: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం దరిగాం గ్రామ అటవీ ప్రాంతంలో పులులు మృతి చెందిన ఘటనపై అటవీశాఖ అధికారులు విచారణ చేపడుతున్నారు. షర్కపల్లి, రింగరీట్, దరిగాం గ్రామాలకు చెందిన పలువురు అనుమానితులను బుధవారం అదుపులోకి తీసుకొని కాగజ్‌నగర్ డివిజన్ కార్యాలయానికి తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న వారి కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. గంటల కొద్దీ వేచి ఉన్నా తమ పిల్లలను కలువనివ్వడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. జడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి ఆధ్వర్యంలో గురువారం రాత్రి కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో వెనక్కి తగ్గిన అధికారులు తమ అదుపులో ఉన్నవారిని కలిసేందుకు అనుమతించారు. ఇందులో ఇద్దరు మైనర్ బాలురు ఉండగా, వారిని బయటకు పంపించారు. వారు మీడియాతో మాట్లాడుతూ తమను ఇష్టారాజ్యంగా కొట్టారని, దీంతో భయపడి ఒప్పుకున్నట్లు వేలిముద్రలు వేశామని ఆవేదన వ్యక్తం చేశారు. అదుపులో ఉన్నవారందరినీ బట్టలు విప్పి కొట్టారంటూ మైనర్ బాలురు చెప్పారు.

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దరిగాం అడవుల్లో మృతిచెందిన పులి కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

కాగజ్‌నగర్ కారిడార్‌లో పులుల కోసం అన్వేషిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

ఆన్‌లైన్ ప్రక్రియ వేగంగా పూర్తవ్వాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్
- మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో పరిశీలన

మందమర్రి కమిషనర్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మందమర్రి, జనవరి 11: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ గద్దె రాజును దరఖాస్తుల వివరాలు, ఆన్‌లైన్ విధానం.. తదితర వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 17వ తేదీకల్లా దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ అచ్యుత్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికలు పక్కాగా రూపొందించాలి..

నస్పూర్, జనవరి 11 : గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ప్రాథమిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ప్రణాళికలు పక్కాగా రూపొందించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు, మండల అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆయా స్థాయిల్లో అవసరాలను గుర్తించి.. అందుకనుగుణంగా నిధులు కేటాయిస్తూ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీఈవో నరేందర్, డీఆర్‌డీవో శేషాద్రి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో, ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత రుద్ర-11

విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చెన్నూర్, జనవరి 11 : పట్టణంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వీరమల్ల మురళీమోహన్ స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నీ గురువారం ముగిసింది. మొత్తం 19 జట్లు పాల్గొనగా నిర్వాహకులు నాలుగు రోజుల పాటు పోటీలు నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఫైనల్‌లో రుద్ర-11, ఫ్రెండ్స్-11 జట్లు హోరాహోరీగా తలపడగా, రుద్ర-11జట్టు గెలుపొందింది. ఫ్రెండ్-11 జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజొద్దీన్, బీఆర్ఎస్ నాయకుడు రాంలాల్ గిల్డాలు షీల్డ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు, బీఆర్ఎస్ నాయకులు వీరమల్ల రాము, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మానికరౌతు శంకర్ పాల్గొన్నారు.

హైమన్‌డార్ఫ్‌కు ఘన నివాళి

- పాల్గొన్న ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, బొజ్జు, ఎంపీ బాపూరావ్, మాజీ ఎంపీ గోడం నగేశ్

హైమన్ డార్ఫ్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జైనూర్ జనవరి 11: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలో గిరిజనుల ఆరాధ్య దైవం, ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్-బెట్టి ఎలిజబెత్ దంపతుల 37వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్, మాజీ ఎంపీ గోడం నగేశ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పాల్గొని డార్ఫ్ దంపతుల సమాధుల వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వర్ధంతి సభలో వారు మాట్లాడుతూ అడవిబిడ్డల అభ్యున్నతికి హైమన్‌డార్ఫ్ దంపతులు చేసిన సేవలను కొనియాడారు. మార్లవాయిని ఆదర్శంగా తీర్చిదిద్దిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సర్పంచ్ కనక ప్రతిభవెంకటేశ్ ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించుకోవడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ కేసీఆర్ సర్కారులో మార్లవాయిని ఎంతో అభివృద్ధి చేశామని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ కనకరాజు, రాష్ట్ర మహిళా ఉద్యమ నాయకురాలు సుగుణక్క, ఎంపీపీ తిరుమల విశ్వనాథ్, వైస్ ఎంపీపీ చెర్లె లక్ష్మణ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాలా, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మడావి భీంరావ్, ఆదివాసులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 11: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. గురువారం స్థానిక గిరిజన క్రీడా పాఠశాలలో ఎంపీపీ కప్ పోటీల ముగింపు కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జడ్పీటీసీ అరిగేల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ దాసరి వేణు (రెవెన్యూ)లతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుతులను ప్రదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ఎంపీపీ అరిగేల మల్లికార్జున్ పోటీలు నిర్వహించడం అభిందనీయమన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. మూడేళ్లుగా ఎంపీపీ కప్ నిర్వహించడం గొప్ప విషయమని కొనియాడారు. అదనపు కలెక్టర్ దాసరి వేణు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులు ఇలాంటి వేదికలను సద్వినియోగం చేసుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిగేలా మల్లికార్జున్, జిల్లా రవాణా శాఖ అధికారి గంధం లక్ష్మి, డీఈవో పార్శి అశోక్, ఎంపీడీవో శశికళ, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, పరీక్షల సహాయ కమిషనర్ ఉదయ్ బాబు, జిల్లా క్రీడల సమాఖ్య అధికారి సాంబశివరావు. క్రీడల అధికారి బండ మీనా రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుభాష్, తదితరులు ఉన్నారు.

సంక్రాంతి సెలవులొచ్చినయ్..

ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో గురువారం విద్యార్థులు ఇంటిబాట పట్టారు. తమను తీసుకెళ్లేందుకు వచ్చిన తల్లిదండ్రులతో కలిసి మంచిర్యాల బస్టాండ్‌కు చేరుకోగా.. ఆ ప్రాంతం కిక్కిరిసి పోయింది. ఏ ప్లాట్‌ఫాంపై చూసినా సందడి కనిపించింది. అవసరమైనన్ని బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కొంత మంది ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు.

- మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జనవరి 11

విద్యార్థులు, తల్లిదండ్రులు కిటకిటలాడుతున్న మంచిర్యాల బస్టాండ్

జైనూర్ ప్రధాన రాహదారి పై రాస్తారోకో చేస్తున్న డ్రైవర్లు

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి

- డ్రైవర్ల డిమాండ్.. జాతీయ రహదారిపై ధర్నా

చెన్నూర్, జనవరి 11: కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని లారీలు, ఐచర్ వాహనాల డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం చెన్నూర్ పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై లారీలు, ఐచర్ వాహనాలను నిలిపివేసి.. ధర్నా చేశారు. హిట్ అండ్ రన్ చట్టాన్ని విరమించుకునే వరకూ ఆందోళనలు చేపడుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లారీ, ఐచర్ డ్రైవర్ల అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

డ్రైవర్ల రాస్తారోకో

జైనూర్, జనవరి 11 : కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డ్రైవర్లు డి మాండ్ చేశారు. ఈ మేరకు జైనూర్ మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం డ్రైవర్లపై ఉక్కుపాదం మోపుతుందని మండిపడ్డారు. చట్టాన్ని వెంటనే రద్దు చేసి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్ల సంఘం నాయకులు ఇమ్రాన్ ఖాన్, శేఖ్ రజాక్, హైదర్,శేఖ్ అజీజ్,శేఖ్ ఫయాజ్, సయ్యద్ రబ్బాని, హసీం, ఫారుఖ్ తదితరులున్నారు.

జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న లారీ డ్రైవర్లు